
ప్రజాశక్తి
సోమవారం 19 మే 2025 5
శ్రీ సత్యసాయి



నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లుజిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వానొచ్చి.. ఎండకు సెలవిచ్చి..!

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాను వాన వీడలేదు. ఉదయం ఎండగా ఉన్నా రాత్రి అయ్యే సరికి వర్షం వస్తోంది. దీంతో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో ఆదివారం తెల్లవారుజామున విస్తారంగా వర్షాలు పడ్డాయి .ఆ ప్రాంతాల్లో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. కొన్నిచోట్ల రహదారులకు అంతరాయం ఏర్పడింది .ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బూదగవి వంక మరువ పారుతోంది. విడపనకల్లు– ఆర్.కొట్టాల, పెంచలపాడు– పొలికి, ఉరవకొండ – ఉండబండ, పాల్తూరు – మల్లాపురం గ్రామాల మధ్య ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కనేకల్లు మండలం రచ్చ మర్రి గ్రామంలో హనుమంతప్పకు చెందిన పశువులపాక పైకప్పు కూలడంతో మూడు దున్నపోతులు మృతి చెందాయి మరో రెండింటికి కాళ్లు విరిగాయి. సొల్లాపురం గ్రామంలో వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడ్డాయి. జిల్లావ్యాప్తంగా సగటున 33. 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా విడపనకల్లు మండలంలో 95.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవగా ఉరవకొండలో 89.2, వజ్రకరూరులో 86.2, బెలుగుప్ప లో 75.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. బొమ్మనహాల్ లో 67.4, బ్రహ్మసముద్రం 56.4, గుంతకల్లు 52.4, గుమ్మగట్టలో 52.2. కనేకల్లులో 46.8, రాయదుర్గంలో 45.6, కనేకల్లులో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

మరో నాలుగు రోజులు వర్ష సూచన

మరో నాలుగు రోజులు పాటు రాయలసీమ ప్రాంతంలో వర్ష సూచనలు ఉన్నట్టు వాతావరణ శాఖ చెబుతోంది. వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉరవకొండ, రాయదుర్గంలో విస్తారంగా వర్షాలు
పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కనేకల్ మండలంలో కురిసిన వర్షానికి సొల్లాపురం వద్ద ప్రవహిస్తున్న వంకలో చిక్కుకున్న వాహనాలు

వారం రోజుల పాటు వర్షాలు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆది, సోమవారాల్లో ఈదురుగాలు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులకు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. వర్షాలు అధికం అయితే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎలాంటి నష్టం జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. వర్షాలకు సంబంధించి కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వర్షం సమాచారం దేనినైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 08555 289039 ఫోన్‌కు తెలియజేయవచ్చున్నారు.

జిల్లాలో 829.6 మి॥మీ॥ వర్షపాతం

జిల్లాలో 32 మండలాల్లో శనివారం రాత్రి విస్తారంగా వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 829.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అత్యధికంగా గోరంట్ల మండలంలో 97.2 మి॥మీ, అమడగూరు 74.8, చెన్నేకొత్తపల్లి 55.4, పుట్టపర్తి 46.4, కొత్తచెరువులో 42.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అతి స్వల్పంగా బత్తలపల్లి మండలంలో 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈదురు గాలులకు పలు మండలాలలో మామిడి, అరటితో పాటు తదితర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

తిరంగా ర్యాలీలో తిరగబడిన జాతీయజెండా

ఫ్లెక్సీలో జెండా రంగులు తలకిందులు
మున్సిపల్ అధికారుల నిర్వాకంపై ఆగ్రహం

ప్రజాశక్తి - కదిరి టౌన్

భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన కాల్పుల్లో గోరంట్ల మండలం కల్లి తండాకి చెందిన మురళి నాయక్ వీర మరణం పొందారు. ఈ నేపథ్యంలో సైన్యానికి మద్దతుగా నిలబడాలనే ఉద్దేశ్యంతో ఆదివారం పట్టణంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కదిరి పట్టణంలోనీ జీవిమాను కూడలి వద్ద ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లోని ఫ్లెక్సీలో జాతీయ జెండా రంగులు తలకిందులుగా మార్చారు.దీంతో మున్సిపల్ అధికారులు నిర్వాకం పై పట్టణ వాసులు తప్పుపట్టారు.కదిరి మున్సిపల్ అధికారుల నిర్వాహకం వల్ల జాతీయ జెండాను తలకిందులుగా వేయడం చాలా బాధాకరమని ఇది జాతీయ జెండాకి భారతదేశానికి తీవ్ర అవమానమని సోషల్ మీడియా వేదికగా మున్సిపల్ అధికారుల నిర్వాకం పై విమర్శలు గుప్పించారు. దీంతో అధికారులు ఆ ఫ్లెక్సీని అక్కడి నుంచి తొలగించారు. జాతీయ జెండాకు జరిగిన అవమానంపై పట్టణవాసులు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఫ్లెక్సీలోని జాతీయజెండాలో తలకిందులుగా ఉన్న రంగులు

ఎన్నిక (అ)టెన్షన్..!

నేడు కదిరి మున్సిపల్ చైర్మన్, గాండ్లపెంట, రామగిరి ఎంపిపి ఎన్నిక
కదిరి, గాండ్లపెంటలో టిడిపి పైచేయి- రామగిరిలో ఉత్కంఠ
ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. సోమవారం కదిరి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికతో పాటు గాండ్లపెంట, రామగిరి మండలాల్లో ఎంపిపి ఎన్నిక జరుగనుంది. ఈ మూడు చోట్ల వైసిపికి చెందిన వారే అధికారంలో ఉండేవారు. సాధారణ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ సమీకరణాలు మారాయి. ఈ నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఆమె పదవీచ్యుతురాలైంది. దీంతో ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. అలాగే గాండ్లపెంట ఎంపీపీ జగన్మోహన్ రాజీనామాతో అక్కడ ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. దీంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్, గాండ్లపెంట ఎంపీపీ ఎన్నికలు సోమవారం నిర్వహించనున్నారు. కదిరి మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా ఇటీవల వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు టీడీపీ గూటికి చేరారు . దీంతో టీడీపీకి 25 మంది కౌన్సిలర్లు ఉండగా వైసీపీకి 11 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ నేపథ్యంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎవరు ఎన్నిక అవుతారన్న చర్చ పట్టణంలో సాగుతోంది. టిడిపి గూటిలో ఉన్న 25 మంది కౌన్సిలర్లు బెంగళూరు క్యాంపులో ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకి కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో నేరుగా మున్సిపాల్టీ కి చేరుకోనున్నారు. ఇదిలా ఉండగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నికను వైసీపీ బహిష్కరించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఛైర్ పర్సన్ పోటీకి ఎక్కువగా పోటీ నెలకొనడంతో మున్సిపల్ ఛైర్ పర్సన్ వైస్ ఛైర్మన్‌ల అభ్యర్థుల ఎంపిక కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కౌన్సిలర్లతో విడివిడిగా మాట్లాడి అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా గాండ్లపెంట ఎంపిపి ఎన్నిక కూడా సోమవారం నిర్వహించనున్నారు. ఈ స్థానాన్ని కూడా టిడిపి వర్గీయులే చేజిక్కించుకోనున్నారు. ఇక రామగిరి ఎంపిపి ఎన్నిక ఉత్కంఠత రేపుతోంది. ఆ స్థానాన్ని ఎవరు చేజిక్కుంచుకుంటారన్నది సోమవారం తేలనుంది.



కదిరి మున్సిపల్ కార్యాలయం

సంస్కరణలతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం
మినీ మహానాడులో హిందూపురం ఎంపీ పార్థసారథి



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎంపీ పార్థ సారథి

ప్రజాశక్తి-హిందూపురం

నూతన సంస్కరణలతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని హిందూపురం ఎంపీ పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో టిడిపి మినీ మహానాడు జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, ఎంపీ పార్థసారథి, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నా అది చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. టిడిపి ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు అడుగుజాడల్లో సీఎం చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ నడుస్తూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. గత ప్రభుత్వం వైఫల్యం వల్ల ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో చంద్రబాబు నడుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్ కుమార్, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు బేవనహళ్లి ఆనంద్, గ్రీన్ పార్క్ నాగరాజు, రాము, బాచి, అమర్నాథ్, అశ్వర్థ నారాయణ రెడ్డి, రంగారెడ్డి, పరిమళ, ఆదినారాయణ, జయప్పతో పాటు అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి చిరుత, ఎలుగుబంట్లు

భయాందోళనలో గ్రామస్తులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ మండలంలో జనారణ్యంలో చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. ఏళ్ల తరబడి గుడిబండ కొండ చుట్టూ చిరుతలు, ఎలుగుబంట్లు విచ్చలవిడిగా తిరుగుతూ రాత్రి వేళల్లో గుడిబండ కొండ చుట్టూ ఉన్న ఇళ్ల ముందు కట్టేసి ఉన్న ఆవు దూడలు, మేకల,గొర్రెల మందలపై దాడులు చేసి చంపేస్తున్నాయి. ఈ ఘటనలపై ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఘటన జరిగిన మరుసటి రోజు గ్రామాలకు వచ్చి తూతూ మంత్రంగా విచారణ జరిపి చేతులు దులుపుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఫారెస్ట్ అధికారుల వ్యవహారంపై పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా వారిపై వాదనలకు దిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రతిరోజు చిరుత పులులు ఎలుగుబంటు సాయంత్రం 5 గంటలు దాటితే చాలు కొండ దిగి ప్రజలకు తారసపడుతుంటాయి. రాత్రి10 గంటలు అయితే చాలు గుడిబండ కొండ చుట్టూ నివాసం ఉంటున్న ప్రజలు ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏసమయంలో ఏం జరుగుతుందో అని తమ గొర్రెపిల్లలపై మేకలపై ఆవు దూడలపై ఎప్పుడు చిరుతలు, ఎలుగుబంట్లు,వచ్చిదాడి చేస్తాయోనని బిక్కు బిక్కుమంటూ కాలం వెల్లదీస్తుంటారు. ఈత తంగం గుడిబండలో దాదాపు గత 7 ఏళ్లుగా జరుగుతున్న సంబంధిత ఫారెస్ట్ అధికారులు మాత్రం నిర్లక్ష్యభావంతో ఉంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొండపై కొండ చుట్టూ చిరుతలు ఎలుగుబంటి సంచరిస్తున్న ఫోటోలు ఫారెస్ట్ అధికారులకు పంపి ఇక్కడి స్థితిగతులను వారికి విన్నవించినా ప్రయోజనం కన్పించడం లేదని విమర్శిస్తున్నారు. కొండ ప్రాంతం నుంచి రాత్రి 10 గంటలు దాటిన తర్వాత కొండ పక్కనే ఉన్న ఎస్సీ, బీసీ కాలనీల మీద ఆహారం కోసం సమీపంలోని తోటలు, ఫారెస్ట్ ప్రాంతాలకు వెళ్లి ఆ తర్వాత తెల్లవారుజామున 3, 4 గంటల సమయంలో కొండ గుహల్లోకి చేరుకుంటాయని పరిసర ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ఈ అడవి జంతువులు జనారణ్యంలోకి వచ్చిన సమయంలో కుక్కలు విపరీతంగా అరుస్తూ గగ్గోలు పెడతాయని ఆ సమయంలో తాము బయటకు రామని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో బహిర్భూమికి వెళ్లిన వారిపై ఎలుగుబండ్లు దాడులు చేసి గాయపరిచిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. అయితే తమ సమస్యలను ఫారెస్ట్ అధికారులు తేలికగా కొట్టేస్తూ చిరుతపులులు, ఎలుగుబంట్లు మిమ్మల్ని ఏమి చేయవని ఉచిత సలహాలు ఇస్తుంటారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిసున్నారు. గతంలో మద్దనకుంట, గుడిబండ, గొల్లపల్లి, తాళికెర, చిగతూర్పి, పలారం, మందలపల్లి తదితర గ్రామాల్లో ఎలుగుబంట్లు, చిరుతలు ప్రవేశించి చేసిన దాడుల్లో ప్రజలు, మూగ జీవాలు గాయాలపాపై మృత్యువాత పడ్డ సంఘటనలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఫారెస్ట్ ఉన్నతాధికారులు స్పందించి మూగజీవులకు ప్రజలకు ఏదైనా జరగరానిది జరగకముందే చిరుత తగిన చర్యలు తీసుకోవాలని కొండ పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ప్రతి రేషన్ కార్డు లబ్ధిదారుడు తన కుటుంబ సభ్యులందరితో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతినెల సబ్సిడీతో నిత్యావసర వస్తువులు ఆయా చౌక దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం త్వరలో గతంలో ఉన్న రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనుంది. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు అందరూ ఐదేళ్ల పైబడిన వారు 80 ఏళ్ల వయసు లోపల ఉన్నవారు కచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైతే ఈకేవైసీ చేయించుకోరో ఆ సభ్యులకొచ్చే నిత్యావసర వస్తువులలో కోత పడుతుందని ప్రభుత్వం హెచ్చరించింది. ఇంకా ఈకేవైసీ చేయించుకొని వారికోసం ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు విధించింది. అలాగే చాలాచోట్ల మారుమూల గ్రామాల్లో ప్రజలు నిత్యావసర వస్తువులు పొందాలంటే సర్వర్ పని చేయక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువులు సరఫరా చేసే వాహనాలు (ఎం డి యు) కొన్ని గ్రామాలకు నిలిచివేయబడ్డాయి. దీంతో డీలర్ ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లా లో ఎన్ని చౌక దుకాణాలు ఉన్నాయి? ఎన్ని రేషన్ కార్డులు ఉన్నాయి? స్టాక్ పాయింట్లు ఎన్ని, ఎక్కడెక్కడ ఉన్నాయి?

జవాబు : జిల్లాలో మొత్తం 1367 చౌక దుకాణాలు ఉన్నాయి. 5,66,057 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం సభ్యులు 16,89,531 మంది ఉన్నారు. జిల్లాలో స్టాక్ పాయింట్లు 12 ఉన్నాయి. ఇవి ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, ముదిగుబ్బ, కదిరి, గాండ్లపెంట, తనకల్లు, బుక్కపట్నం, ఓడి చెరువు, గోరంట్ల, పెనుకొండ, హిందూపురం, మడకశిరలో ఉన్నాయి. ప్రతి నెల డీలర్లు 20వ తేదీ లోపు డీడీలు చెల్లిస్తే వారికి స్టాక్ పాయింట్ల ద్వారా ఒకటవ తేదీ లోపల నిత్యవసర వస్తువులు సరఫరా చేయబడతాయి.



ప్ర : ప్రతినెల బియ్యం, ఇతర సరుకులు ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేయబడుతున్నాయి?

జ : కొన్ని డిపోలలో ఒక్కొక్కసారి సరుకులు మిగిలిపోతుంటాయి. దీనినే బఫర్ స్టాక్ అంటాం. ఆ బఫర్ స్టాక్ మినహాయించి సరుకులు డీలర్‌కు ఇవ్వడం జరుగుతుంది. గత నెల ఏప్రిల్ లో పంపిణీ చేసిన వివరాల మేరకు 86,00,172 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేశాం. బియ్యంతో పాటు చక్కెర, ఒక్కోసారి స్టాకును బట్టి కంది బేడలు, బట్టల సబ్బులు, సర్ఫ్ పొడి, పంపిణీ చేయడం జరుగుతుంది.

ప్ర : డీలరు ఎన్ని రోజుల వరకు సరుకులు ఇవ్వవచ్చు? సరుకులు లబ్ధిదారులు తర్వాతి నెలలో తీసుకోవచ్చా? ఎక్కడైనా సరుకులు తీసుకోవచ్చా?

జ : ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు డీలర్లు సరుకులు పంపిణీ చేస్తారు. ఒక నెలలో సరుకులు తీసుకొని లబ్ధిదారులు తర్వాతి నెలలో తీసుకోవడానికి వీలు లేదు. ఏ నెలలో సరుకులు ఆ నెలలోనే తీసుకోవాల్సి ఉంటుంది. రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుడు జిల్లాలో ఎక్కడైనా చౌక ధాన్యపు డిపోలలో తీసుకొని అవకాశం ప్రభుత్వం కల్పించింది.

ప్ర : మారుమూల గ్రామాల్లో సర్వర్ సమస్య ఉంది? వాటికి పరిష్కారం ఏమిటి?

జ : మారుమూల గ్రామాల్లో అక్కడక్కడ సర్వర్ సమస్య ఎదురవుతున్న మాట వాస్తవమే. వాటి పరిష్కారంగా ఆఫ్ లైన్ పద్ధతిలో పంపిణీ చేసి అనంతరం ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుంది. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సరుకుల పంపిణీ జరుగుతోంది.

ప్ర : జిల్లాలో గ్రామాలకు సరుకులు చేరవేసే ఎం డి యు వాహనాలు ఎన్ని? అవి అన్ని పని చేస్తున్నాయా?

జ: జిల్లాలో మొత్తం 349 ఎండియు వాహనాలు ఉన్నాయి. వాటిలో 259 పర్మినెంట్ వాహనాలు. 39 తాత్కాలిక వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం 298 మాత్రమే పనిచేస్తున్నాయి. వాహనాల ద్వారా పంపిణీ చేయలేని పరిస్థితులలో డీలర్ నెలకొల్పిన చౌక ధాన్యపు డిపో నుంచి లబ్ధిదారులు సరుకులు తీసుకోవచ్చు.

ప్ర : కొంతమంది డీలర్లు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి? అలాంటి వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ : డీలర్లు అవినీతి అక్రమాలు చేస్తున్నారని ఆరోపణలు తమ దృష్టికి వస్తే విచారణ చేపట్టి అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు రుజువు అయితే 6 ఎ క్రింద కేసు నమోదు చేసి డీలర్ ను విధుల నుంచి తొలగిస్తాము. తరువాత నియమించే డీలర్ కు తగిన సూచనలు ఇస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకూడదని హెచ్చరికలు చేస్తాం.



వంశీకృష్ణారెడ్డి

ప్ర : సిబ్బంది కొరత ఉందా? ప్రజలకు మీరు ఇచ్చే సూచనలు సలహాలు ఏమిటి?

జ : సిబ్బంది కొరత లేదు. ఈకేవైసీ చేయించుకొని వారు వెంటనే ఆయా డీలర్ల దగ్గరకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలి. ఇంకా ఈ కేవైసీ చేయించుకోని వారు 99,872 మందిఉన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే వారికి వచ్చే రేషన్ కోతపడుతుంది. ఈ విషయాన్ని గమనించి లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులందరికీ ఈకేవైసీ చేయించాలి. ప్రతినెల 1వ తేదీ నుంచి 17వ తేదీ లోపల లబ్ధిదారులు సరుకులు తీసుకోవాలి. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చు.



కిట్లను అందజేస్తున్న జనసేన నాయకులు

జనసేన సభ్యత్వ నమోదు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేసిన క్రియాశీలక కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కిట్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్, నాయకులు మంచి శివశంకర్‌లు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. కార్యకర్తల సంక్షేమం కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వంతో బీమా సదుపాయం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర, మండల కన్వనర్లు రవికుమార్, జయవర్ధన, కెవి.రమణ, రవీంద్ర నాయక్, అంజిబాబు, కిన్నెర మహేష్, లక్ష్మణ్, రాజేంద్ర, ప్రతాప్, శ్రీనివాసులు, సత్యవతి, రెడ్డి రాయల్, రాజా, గంగరాజు, మునికుమార్ పాల్గొన్నారు.

20న మినీ మహానాడు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నియోజకవర్గం మినీ మహానాడును ఈనెల 20న కదిరి పట్టణం మదనపల్లి రోడ్డులో ఉన్న పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం 9:00 గంటలకు మహానాడు ప్రారంభం అవుతుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జిలు, మండల కన్వీనర్లు, టిడిపి అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, మహానాడులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చిన్నన్నపల్లి-లాల్లేపల్లి రోడ్డుకు భూమిపూజ



భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పీఏ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని చిన్నన్నపల్లి క్రాస్ నుంచి లాల్లేపల్లి వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా తారు రోడ్డు లేని చిన్నన్నపల్లి గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా ఈ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నాగరాజు యాదవ్, రంగారెడ్డి, గంగాధర్, బాలాజీ, గౌరీశంకర్, నందీష్, శ్రీనివాసులు, నారాయణస్వామి, జయచంద్ర రెడ్డి, హనుమంతప్ప పాల్గొన్నారు.

మహానాడు ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యులుగా పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగుదేశం పార్టీ కడపలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమానికి ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యులుగా ఎపిఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

పురంలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

ఆపరేషన్ సంధూర్ విజయవంతం కావాడంతో ఆదివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. సూగూరు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, అక్కడి నుండి అంబేద్కర్ కూడలి వరకు వేలాది మందితో తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, అధికారులు మాట్లాడుతూ భారతీయ పౌరులను పొట్టును పెట్టుకున్న ఆగ్రమూకలపై ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైనికులు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. ఆ ఆపరేషన్‌తో భారత సైనిక సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు సురేంద్ర, వీరయ్య, బాలాజీ, టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజినప్ప, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జెవిఎస్.అనిల్ కుమార్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, నాగేంద్రమ్మ, టీడీపీ నాయకులు అమర్ నాథ్, దుర్గా నవీన్, ప్రెస్ వెంకటేష్, హెచ్ఎన్.రాము, నంబూరి సతీష్, బీజేపీ నాయకులు పార్థసారథి, ఆదర్శకుమార్, జనసేన నాయకులు ఆకుల ఉమేష్, శేఖర్, చక్రి పాల్గొన్నారు.



పురంలో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

యుటిఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్ల పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) వెల్ఫేర్ పాలసీ బాండ్లను అందజేశారు. ఆదివారం నాడు పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి వీటిని జిల్లా నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యుటిఎఫ్ నాయకుల సంక్షేమం, ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని మా వెల్ఫేర్ పాలసీ పేరుతో రాష్ట్ర, జిల్లా నాయకులకు అందజేస్తున్నారని చెప్పారు. ఈ పాలసీలో భాగంగా యుటిఎఫ్‌కు సంబంధించిన వారు ఎవరైనా అనారోగ్య రీత్యా శస్త్ర చికిత్సలు అవసరం అయితే ఈ పాలసీ ద్వారా రూ.



యుటిఎఫ్ వెల్ఫేర్ పాలసీ బాండ్ల పంపిణీ చేస్తున్న జయచంద్ర

లక్ష నుంచి రూ.2 లక్షల వరకు తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. మరణిస్తే రూ.2 నుంచి రూ.5 లక్షల తక్షణ సహాయం అందుతుందన్నారు. ప్రస్తుతం ఈ వెల్ఫేర్ పాలసీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి అందిస్తున్నారని, త్వరలో మండల, పట్టణ నాయకత్వానికి, కార్యకర్తలకు కూడా అమలుచేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మేరివర కుమారి, జిల్లా కార్యదర్శులు ఎం.లతాదేవి, ఆర్.రామకష్ణ నాయక్, ధర్మవరం జోన్ నాయకులు ఎం.ఆంజనేయులు, ఎ.లక్ష్మయ్య, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, ఎం.రాంప్రసాద్, పి.సాయి గణేష్, హెచ్.రామాంజనేయులు పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ఆరోపణలను సహించం : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రీకాట్ మిల్ విషయంలో మంత్రి సవితపై వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అసత్య ఆరోపణలు మానుకోవాలని టిడిపి నాయకులు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ అవగాహన లేకుండా మంత్రిపై ఆవాకులు చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుకొండ నియోజకవర్గం, ఇక్కడి పరిశ్రమల గురించి అర్థం లేకుండా ఆమె మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రీకాట్ సూపర్ స్పిన్నింగ్ మిల్లు గత దశాబ్దాలుగా ఎంతోమందికి ఉపాధి కల్పించిందన్నారు. అలాంటి పరిశ్రమను వైసిపి ప్రభుత్వం హయాంలోనే నష్టాల్లోకి వెళ్లిందన్నారు. దీనిని గుర్తించకుండా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితపై కారణం అనేలా ఉషశ్రీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఉషశ్రీచరణ్ వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి కళ్యాణదుర్గంలో ఎన్ని పరిశ్రమలు స్థాపించారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం హయాంలో కియా కార్ల కంపెనీ, కియా అనుబంధ సంస్థలు, నాసిన్, బెల్ తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికి ఉందన్నారు. జగన్ ప్రభుత్వంలో పెనుకొండ నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమ నెలకొల్పిన దాఖలాలు లేవన్నారు. జగన్ ప్రభుత్వం నవరత్నాలు పథకాలు అమలు చేయడానికి 5 ఏళ్ల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పట్టిందని, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు దాదాపు ఒక సంవత్సరంలో పూర్తి చేశారని తెలిపారు. భవిష్యత్తులో పెనుకొండ నియోజకవర్గం గురించి ఉషశ్రీ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు త్రివేంద్ర, బాబుల్ రెడ్డి, నారాయణ నాయక్, చంద్రకాంతమ్మ, కురుబ నంజుండ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తున్నాం

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటికీ అమలు చేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలియజేశారు. ఆదివారం నాడు ఆయన మండలంలో పర్యటించారు. వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెలలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవలను అమలు చేస్తూ ఖాతాల్లోకి డబ్బులు జమ చేయనున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి ఇప్పటికే సంబంధిత రైతుల వివరాలు ఆయా మండల వ్యవసాయ శాఖ అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. తల్లికి వందనం కింద ఇంట్లో చదువుకునే ప్రతి ఒక్కరికీ రూ.15వేలు అందిస్తామన్నారు. ఆగస్టులో మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.3వేల పింఛన్ రూ.4వేలకు పెంచామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. రైతులకు నష్టదాయకం జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు.. అరికట్టేదెవరు..?

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా రియల్టర్లు లేఅవుట్లను వేస్తున్నారు. లేఅవుట్ల సుందరీకరణ పేరుతో రహదారులకు అడ్డంగా మట్టిని ఎత్తుగా పోసి వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లను వేస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. సోలార్ సమీపంలో కొత్త రోడ్డు దగ్గర ఇటీవల లేఅవుట్లను వేశారు. బిసి బాలుర వసతి గృహానికి సమీపంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుని ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. తహశీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలోనే దాదాపు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే లేఅవుట్లు వేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. అధికారులకు వీటిని చూస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గొర్రెల షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

గొర్రెల షెడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-అగళి

మండలంలోని పూలపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన గొర్రెల షెడ్లను మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశువులు, గొర్రెల భద్రత కోసం ఒక్కో రైతుకు రెండు లక్షలు రూపాయలు మంజూరు చేసిందన్నారు. పాడి రైతులు ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకని షెడ్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, టిడిపి మండల కన్వీనర్ కుమార్ స్వామి, శివకుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైనికులకు అండగా నిలుద్దాం

తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

దేశ రక్షణలో భాగంగా ప్రాణాలను అడ్డుపెట్టి పోరాటం సాగిస్తున్న సైనికులకు ప్రజలందరూ అండగా నిలిచి వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ సైనికులు ఆపరేషన్ సింధూర చేపట్టి విజయవంతం కావడంతో సైన్యానికి మద్దతుగా ఆదివారం నాడు కదిరి తిరంగా ర్యాలీని చేపట్టారు. ర్యాలీ పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నుంచి మొదలై జీవిమాను కూడలి, ఎంజీ రోడ్డు, కోనేరు కూడలి, హిందూపురం క్రాస్, టవర్ క్లాక్, కాలేజ్ సర్కిల్, అంబేద్కర్ కూడలి మీదుగా జీవిమాను కూడలి వరకు కొనసాగింది. ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులను మట్టుబెట్టిని సైన్యం యావత్



ప్రజలతో కలిసి తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

దేశ ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చిందన్నారు. పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళి నాయక్ రియల్ హీరో అన్నారు. సైనికుల పోరాటం, త్యాగం ఎప్పటికీ మరువలేనివని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, వ్యాపారులు, ఓబులేశ్వర డిఫెన్స్ విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హొయసల వీరబల్లాలుని శాసనం గుర్తింపు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలోని శ్రీ సజ్జగంట రంగనాథ స్వామి గుడిలో దక్షిణం వైపున గోడపై హొయసల ప్రభువు మూడో వీరబల్లాలుని శాసనం, ఆరుబయల్లో బందావనంపై విజయనగర రాజ్య తొలినాళ్ల శాసనాన్ని గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. ఆలయ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రమాకాంత్ రెడ్డి చారిత్రక పరిశోధకుడు వంగపల్లి గోపి లతో కలిసి ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. రంగనాథస్వామి ఆలయం గర్భగుడి ముందున్న అంతరాళంర, వెలుపలభాగంలో అధిష్ఠానంపై పలు శాసనాలు ఉన్నాయన్నారు. చాలావరకు శాసనాలు చదవడానికి వీలు కాకుండా రూపు చెదిరాయన్నారు. గర్భగుడి దక్షిణ గోడ అధిష్ఠానంపై గల ఒక శాసనాన్ని శాలివాహన శకవర్షం 1221 ప్రమాది



హొయసల వీరబల్లాలుని శాసనాన్ని చూపుతున్న మైనాస్వామి

సంవత్సరం మాఘ మాసం అంటే సామాన్య శకం 1299 జనవరి లేదా ఫిబ్రవరి నాటి శాసనంగా గుర్తించినట్టు తెలిపారు. దోరసముద్రం (నేటి హళేబీడు) రాజ్యంలో భాగమైన పెనుకొండసీమ హొయసల మూడో వీరనరసింహ కుమారుడైన మూడో వీరబల్లాలుని పాలన(1292-1343)లో ఉండేదన్నారు. హొయసల ప్రభువు మూడో వీరబల్లాలుడు 1299లో గుడిపల్లిలోని సజ్జగంట రంగనాథ స్వామి సన్నిధిని నిర్మించి ఉండవచ్చని మైనాస్వామి వివరించారు. మూడో వీరబల్లాలుని శాసనాన్ని బట్టి గుడి ప్రాముఖ్యత, ఆలయ ప్రాచీన్యతను తెలుసుకోవచ్చన్నారు. చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీసజ్జగంట రంగనాథ స్వామి సన్నిధిని అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి రమేష్, పెనుకొండ శ్రీధర్, కడపల్లి శ్రీనివాస్, కడపల్లి వెంకటరమణ, సిరివేలు ముద్దప్ప, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపిపి

ఎడ్లబండ్ల పోటీదారులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని నాగారెడ్డి పల్లి శ్రీరాముల గ్రామ ఉత్సవ సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీలో పాల్గొని గెలుపొందిన ఎండ్ల బండ్ల రైతులకు ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ బహుమతులను అందజేశారు. పుట్టపర్తి మండలం నిడుమామిడి గ్రామానికి చెందిన సురేష్‌కు మొదటి బహుమతి, బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లికి చెందిన రాజా నాయుడుకు రెండవ బహుమతి, ఇదే గ్రామానికి చెందిన రెడ్డప్ప గారి చలపతికి మూడవ బహుమతి, ముదిగుబ్బ మండలం ఎస్.బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎర్రబల్లి సూరికి నాలుగవ బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మొలకల పున్నమి పండగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలు ఆద్యంతం ఉల్లాసం, ఉత్సాహంగా జరిగాయన్నారు. గ్రామీణ క్రీడలను భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజునాథ్, మాజీ సర్పంచి వెంకటరమణ, నాగారెడ్డిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు దారుణహత్య

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం మండలం కొంతానపల్లి గేట్ సమీపంలో ఓ యువకుడు శనివారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణంలోని ఓ గార్మెంట్స్‌లో పని చేసే వినోద్‌కుమార్(22)ను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేశారు. రోడ్డు పక్కన పడి ఉన్న మృతదేహాన్ని ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందకున్న సిఐ జయ నాయక్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఉన్న ఆధారాలను బట్టి వినోద్‌కుమార్‌గా గుర్తించారు. యువకున్ని ఎవరు.. ఎందుకు హత్య చేశారన్న విషయంపై కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిఐ జయనాయక్

కాలం చెల్లిన బస్సులతో ప్రయాణం

బస్సులోకి వర్షం నీరు - రాత్రంతా ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి-హిందూపురం

కాలం చెల్లిన బస్సుల్లో సూధుర ప్రాంతాలకు ఎలా ప్రయాణం చేయాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను నిలదీశారు. హిందూపురం డిపోకు చెందిన హిందూపురం-తిరుపతి ఆర్టీసీ సర్వీసులో తిరుపతి నుంచి ప్రయాణికులు శనివారం బయల్దేరారు. శనివారం రాత్రి తిరుపతి 35 మందితో హిందూపురానికి బస్సు బయల్దేరింది. బస్సు మదనపల్లి సమీపాన వచ్చేసరికి వర్షం కురవడంతో బస్సుకు సరైన రక్షణ అద్దాలు లేకపోవడంతో వర్షపు నీరు మొత్తం బస్సులోకి చేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులోకి వర్షం నీళ్లు రావడంతో అందులో ఉన్న చిన్నారులు గుక్కపట్టి ఏడ్చారు. కదిరికి వచ్చేసరికే వస్తువులు, ల్యాప్ టాప్‌లు తడిసి ముద్దయ్యాయి. దీనిపై కదిరిలో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడ మరో బస్సును ఏర్పాటు చేశారు. ఆ బస్సులో ఆదివారం నాడు హిందూపురం డిపోకు చేరుకున్నారు. బస్సు దిగిన ప్రయాణికులు బస్సు మందు ఆందోళన చేపట్టారు. హిందూపురం డిపోలో కాలం చెల్లిన బస్సులను నిలిపి వేయాలంటూ నినాదాలు చేశారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బస్సులో వచ్చేందుకు రాత్రంతా ఆపసోపాలు పడ్డామన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరంతా బస్సుల్లోకి వస్తున్నా దానిని మరమ్మతు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రయాణికులను దష్టిలో ఉంచుకుని సరైన బస్సులు నడపాలని కోరారు.



కాలం చెల్లిన బస్సు ముందు నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాడు పట్టణంలో ఆల్ హిలాల్ పాఠశాల ఆవరణంలో ఉచిత మూర్ఛవ్యాధి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఈటి రామ్మూర్తి నేతృత్వంలో వైద్యులు 149 మంది రోగులకు పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ మూర్ఛవ్యాధిపై ఉన్న అపోహలను విడనాడాలన్నారు. మూర్ఛ వ్యాధిపై ఎలాంటి అపోహలూ అవసరం లేదన్నారు. క్రమం తప్పకుండా వ్యాధిగ్రస్తులు మందులు ఉపయోగిస్తే వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు అన్నారు. మూర్ఛ వ్యాధిగ్రస్తులు నీళ్లు, నిప్పు, యంత్రాలు, ఎత్తైన ప్రదేశాలకు వద్దకు వెళ్లరాదన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పి.రామకృష్ణ, లక్ష్మీపతి, ఉగ్రప్ప, నాగేంద్ర చారి, అబ్దుల్ హక్, నాగరాజు గుప్త, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్య నాయక్, మంజునాథ చారి, విశ్వనాథ చారి పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు రామ్మూర్తి

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరానికి తరలిన విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని స్వాతిబాయి జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నాడు కళాశాలలో విద్యార్థినిని అభినందించి ప్రశంసా పత్రం అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని బెలగావిలో ఉన్న రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయంలో ఈ నెల 19 నుంచి 24 వరకు వారం రోజులు పాటు జరిగే సదస్సుకు ఎస్‌కె యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఆంధ్రప్రదేశ్ టీం ఎంపికైనట్లు తెలిపారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో జరుగుతున్న ఈ జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు ఎంపికైన పదిమంది విద్యార్థుల్లో స్వాతిబాయి ఉన్నారన్నారు. దాదాపు ఐదు భాషలలో అనర్గళంగా మాట్లాడే ఈ విద్యార్థిని 'యువతలో ఉండాల్సిన సేవా దక్పథం యొక్క ప్రాధాన్యత- వ్యక్తిత్వ వికాసం' పై శిబిరంలో వివరించనున్నదని తెలిపారు. కదిరి మండలం సున్నపు గుట్ట తండాకి చెందిన రవినాయక్, కాంతాబాయ్ దంపతుల కుమార్తె స్వాతిబాయ్ గత సంవత్సర కాలంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగే అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోందని తెలియజేశారు. శిబిరానికి ఎంపికైన విద్యార్థినిని కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ శ్రీలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, అధ్యాపకులు రమేష్, బోజ్జప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి బాలయేసు కళాశాలకు చెందిన వినుత లక్ష్మి, బాలాజీ కళాశాలకు చెందిన గిరి వర్షలు శిబిరానికి బయలుదేరి వెళ్లారు. శిబిరానికి బయలుదేరుతున్న అందరికీ హిందూపురం రైల్వే స్టేషన్‌లో బాలయేసు డిగ్రీ కళాశాల ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.



విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధ్యాపకులు

కన్నడ పాఠశాలలకు ప్రాధాన్యత ఇవ్వండి



పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సోమన్న

ప్రజాశక్తి-పావగడ

కన్నడభాష అభివృద్ధి కోసం సరిహద్దు ప్రాంతాల్లోని కన్నడ పాఠశాలలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కన్నడ అభివృద్ధి ప్రాధికార సంస్థ ఛైర్మన్ సోమన్న తెలిపారు. ఆదివారం ఆయన తాలూకాలోని కన్నమేడి గ్రామం పంచవటి రూరల్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలోని కన్నడ పాఠశాలలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలల అభివృద్ధి నిమిత్తం రూ.200 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను కోరామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. పంచవటి, క్యాతగానహళ్లి, కన్నమేడీ మంజునాథ స్వామి రూరల్ హైస్కూల్ నిర్మాణానికి బోర్డర్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ గ్రాంట్ డబ్బులు విడుదల చేయడంతో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డిఎన్.వరదరాజు, మధుగిరి విద్యా జిల్లా డిడిపిఐ గిరిజ, పాఠశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు.